క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం బుట్టాయగూడెం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 8.30 నిమిషాలకు బుట్టాయగూడెం మండలంలోని కామయ్యకుంటలో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం 10 గంటలకు రాజానగరం సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆదివాసీ పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి


కురసం నిరీక్షణరావు

టి.నరసాపురం: దేశంలో ఆదివాసీ పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదివాసీ పాస్టర్ల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడిగా నియమితులైన పాస్టర్, వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి కురసం నిరీక్షణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా గుండి.ఫిలిప్(ఆంధ్ర), ప్రధాన కార్యదర్శిగా మడివి ఫిలిప్(తెలంగాణ), సహాయ కార్యదర్శిగా బండారు జాన్‌బాబు(తెలంగాణ), ట్రెజరర్‌గా చింత శామ్యూల్‌రాజును ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లక్ష్మయ్య మృతి తీరని లోటు

జంగారెడ్డిగూడెం: పేదల అభివృద్ధికోసం, పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించడం కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్న మందపల్లి లక్ష్మయ్య మృతి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. పట్టణానికి చెందిన మందపల్లి లక్ష్మయ్య గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం లక్ష్మయ్య భార్య సుబ్బాయమ్మను, కుమారులను డేగా ప్రభాకర్ పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక


ద్వారకాతిరుమల: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ సమావేశం స్థానిక యూటీఎఫ్ భవనంలో మంగళవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ పాల్గొన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బి.జయరాజు, ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి గెడ్డం దేవానందరావు వ్యవహరించారు.

వ్యాసరచన పోటీల్లో నవ్యకు ద్వితీయస్థానం


ఎస్పీ చేతుల మీదుగా నగదు బహుమతిని అందుకుంటున్న విజేత పి నవ్య

లింగపాలెం : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కొణిజర్ల గ్రామానికి చెందిన పరికిల నవ్య ద్వితీయస్థానం సాధించింది. ఈమేరకు ఏలూరు ఎస్పీ డి మేరీ ప్రశాంతి చేతుల మీదుగా నగదు బహుమతిని అందుకుంది. నవ్య ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10 వతరగతి చదువుతోంది. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: భోగోలు గ్రామానికి చెందిన పి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల చెక్కును గ్రామ సర్పంచ్ తాడేపల్లి శాంతరావు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథక అవకతవకలపై విచారణ

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బియ్యం, కోడిగుడ్లు, వేరుశెనగ చిక్కీలు, సరుకులు పక్కదారి పడుతున్నాయని పేరెంట్ కమిటీ ఫిర్యాదు మేరకు బుధవారం డీవైఈవో రామన్నదొర పాఠశాలలో విచారణ చేపట్టారు. ఎక్కువ మంది విద్యార్థులు భోజనం చేయకపోయినా చేసినట్లు నమోదు చేసి సరుకులను పక్కదారి పట్టిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని డీవైఈవో రామన్నదొర చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 బి.రాముడు, ఎంఈవో-2 జి.రాములు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ స్థానిక పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెలుగు భాష మాట్లాడేవారికి అన్యాయం జరుగుతుండడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డిమాండ్‌కు బీజం పడిందని అన్నారు. ఈ క్రమంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ, భాషా సంయుక్తరాష్ట్రాల కోసం ఉద్యమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ శ్రీనుకుమార్, ఏడీఈ బుచ్చిబాబు, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, ఐటీడీఏ మేనేజర్ ప్రకాష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సచివాలయ కార్యాలయం ఎదురుగా ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వెత్స మణికంఠ, పరకోటి బ్రహ్మయ్య, నల్లజర్ల సంతోష్, తటవర్తి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పోరాట ఫలితమే

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడకలను రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను అర్పించారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఘనంగా జరుపుకున్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంఈఓ బి రామారావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం వల్ల ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారని ఆయన నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు.


చింతలపూడి: పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్

నగర పంచాయతీ ఆధ్వర్యంలో..

నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడకలు నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు, ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పోలవరం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ సుమతి

పోలవరం రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పోలవరంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.సుమతి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జి.శ్రీను అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న పీఓ సూర్యతేజ

అమరజీవికి నివాళి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్రం మొదటిదని, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని కొనియాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.


కామవరపుకోట: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ నరసింహస్వామి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి శ్రీవారి దేవస్థానం వరకు కొత్త 11 కేవీ ఫీడర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వెలిది కృష్ణమూర్తి లేని లోటు తీరనిది


కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: సీనియర్ నాయకులు వెలిది కృష్ణమూర్తి వంటి నాయకులు లేని లోటు ఎవరూ తీర్చలేనిదని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కె.జగ్గవరంలో కృష్ణమూర్తి కుమారుడు వెలిది గంగాధరరావు, ఆయన కుటుంబ సభ్యులను బుధవారం బాలరాజు పరామర్శించారు. దాదాపు 40 ఏళ్లపాటు సహకార సంఘాల అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి పాటుపడిన వెలిది కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం అన్నారు. కృష్ణమూర్తి మరణానికి చింతిస్తూ ఆయన కుటుంబ సభ్యులను బాలరాజు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, సంఘ సీఈవో తనగాల వీరవెంకయ్య, ఎంపీటీసీ బొడ్డపాటి రాంబాబు తదితరులు ఉన్నారు.

సత్యదేవుని ఆలయానికి రాగి చెంబులు అందజేత


ఆలయానికి రాగి చెంబులు అందజేస్తున్న దాత కళ్యాణమ్మ

లింగపాలెం: రంగాపురం గ్రామంలో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన సత్యదేవుని ఆలయంలో భక్తులు వ్రతాలు చేసుకునేందుకుగాను దాత యార్లగడ్డ కళ్యాణమ్మ 50 రాగి చెంబులను అందజేశారు. ఆలయ ప్రధాన గుమస్తా శెట్టిపల్లి గోపి, గుమస్తా రాధికలకు వీటిని అందజేశారు. అనంతరం ఆమె స్వామివారిని దర్శించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ప్రజాదరణ

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- తిరుమలదేవిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

టి.నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై పార్టీకి అండగా నిలుస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేటలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమలదేవిపేట ఎస్సీ ఏరియాలో ఇంటింటికీ తిరుగుతూ ఆయా గృహ యజమానులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి నేటి వరకు వివిధ పథకాల ద్వారా అందిన లబ్ధి వివరాలను వివరించారు. ఆయా కుటుంబాల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరుతూ ముందుకు సాగారు. స్థానిక సమస్యలపై వచ్చిన వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు సూచనలు జారీ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించి వారి ప్రతిభా పాటవాలను తెలుసుకుని ఆ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలివేసి కార్యకర్తల అభివృద్ధికి మాత్రమే పాటుపడిన టీడీపీకి రాష్ట్రంలో పూర్తిగా కాలం చెల్లిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ నేరుగా అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల స్పందనే అందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీవెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, బండివారిగూడెం రాంబాబు, దేవరపల్లి ముత్తయ్య, సర్పంచ్ గొల్లపల్లి సరోజిని, యర్రా గంగాధరరావు, తోట రామారావు, దాకారపు సూరిబాబు, సహకార సంఘం అధ్యక్షుడు దాసరి రాంబాబు, అమరేసు చింతాలు, పీజే, చందనాల శ్రీను, చందనాల ఏసు, టి.శ్రీను, ఆళ్ల ఏసుబాబు, వరికూటి రాంబాబు, రైల్వే బోర్డు డైరెక్టర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కురసం నిరీక్షణరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆచంట నాగమణి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

వాహనాల వేలం


వివిధ నేరాల్లో పట్టుబడ్డ సారాను, లిక్కర్‌ను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

చింతలపూడి: చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. ఎస్ఈబీ ఈఎస్ అమర్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో నిర్వహించిన వేలంలో మొత్తం 13 వాహనాలకుగాను 12 వాహనాలను ఔత్సాహికులు పాడుకున్నారన్నారు. దీంతో మొత్తం రూ.98 వేలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే వివిధ కేసులలో సీజ్ చేసిన నాటు సారా, లిక్కర్‌ను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ, వైద్య సహాయం తీసుకొంటున్న బ్రాహ్మణ సభ్యులు మేడూరి.నాగ వెంకట రమణకు జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికీ అనేక మంది బ్రాహ్మణులకి ఆసరాగా ఉండి, ఈ సంవత్సరం కాలంలో సుమారు రూ.2,50,000 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు కార్యదర్శి కూచిభట్ల రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా అడ్వయిజర్ లంకా నాగకుమార్, కూచి త్రినాథరావు, గన్నవరపు మాధవరావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, మహిళా కార్యవర్గ సభ్యురాలు మదనంబెడు కృష్ణప్రియ, గరిమెళ్ళ శేషశ్రీ, పర్వతం రాధాకృష్ణ, మదనంబెడు సుబ్బారావు, గరిమెళ్ళ సుబ్బారావు, మేడూరి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వెంకట రమణకు సహాయాన్ని అందిస్తున్న ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

బయ్యనగూడెంలో అభివృద్ధి పనులు వేగవంతం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం సర్పంచ్ లింగిశెట్టి అనంత లక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలితలతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నెయ్యల వారి వీధిలో రూ.3 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. అదేవిధంగా కంసాలి వారి వీధిలో రూ.2.5 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న డ్రెయినేజీ పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సమయంలో ప్రజల వద్ద నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధిక ప్రాధాన్యత నిస్తూ నిధులను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం వారం రోజులలో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. వార్డు సభ్యులు మెట్టా లక్ష్మీప్రసన్న పువ్వలసరి రాంబాబు, అల్లం సూరిబాబు, మద్దిపాటి శ్రీను, తలారి నాగు, తొంటా కృష్ణ, ఎం.లక్ష్మీ ప్రసన్న, కోరుకొండ విగ్నేష్, కోరుకొండ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


బయ్యనగూడెంలో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో


తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో అద్దయ్య

పోలవరం రూరల్: జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా పోలవరం రెవెన్యూ కార్యాలయాన్ని ఆర్డీవో కుంభా అద్దయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, మండల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు, ఆర్‌అండ్‌ఆర్ అమలు, నిర్వాసితుల తరలింపు తదితర విషయాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. నిర్వాసితుల సమస్యల విషయంలో జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పట్ల అలసత్వం వహించరాదన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం వంటిదని నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెం సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర పంచాయతీ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


నాగిరెడ్డిగూడెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

చింతలపూడి: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ముస్లింల శ్మశానవాటికకు మోటారు నిమిత్తం పార్టీ నాయకులు జంగా చెన్నకేశవరెడ్డి అందించిన రూ.25 వేల ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే ఎలీజా ముస్లిం కమిటీ పెద్దలకు అందజేశారు. ముస్లిం శ్మశానవాటికకు ఎమ్మెల్యే ఎలీజా ఇటీవల తన సొంత నిధులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని చెప్పారు. ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంగా చెన్నకేశవరెడ్డి, అంజుమన్ మహాఫిజుల్ ఇస్లాం కమిటీ కార్యదర్శి ఎండీ జిలాని, ఎస్ఏ రజాక్, ఎస్‌డీ నవాబ్, ఎస్‌డీ ఖాజా మొయినుద్దీన్, సయ్యద్ రజాక్, ఎస్‌కే సుబాని, ఎస్‌కే ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.


ముస్లింల శ్మశానవాటికకు మోటారు నిమిత్తం చెక్కును ముస్లిం కమిటీ పెద్దలకు అందజేస్తున్న దృశ్యం

జగన్‌తోనే అన్నివర్గాలకు సామాజిక న్యాయం

జంగారెడ్డిగూడెం: అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలో శస్త్రచికిత్స పొంది జంగారెడ్డిగూడెంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 30న దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలో నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సు యాత్ర విజయవంతమైందన్నారు. గ్రామ సర్పంచ్ నుంచి డిప్యూటీ సీఎం వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అందరికి ప్రత్యేకమైన స్థానం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వందనపు వెంకటేశ్వరరావు, చిప్పాడ వెంకన్న, వంటిపల్లి సీతారామస్వామి, కాశీ, కర్పూరం జనార్దన్, పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.


సాయిబాల పద్మను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గణపవరం: మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా మత్స్యకార యువతకు సబ్సిడీపై నాలుగు చక్రాల వ్యాన్‌లను అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.22 లక్షలు కాగా, దీనిలో 60 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ పోలిశెట్టి రమేష్, తహసీల్దార్ సాయిరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాల భవనాల ప్రారంభోత్సవం

చింతలపూడి: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలను ఈనెల 3వ తేదీన ప్రారంభోత్సవం చేయనున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా తెలిపారు. ఈ భవన నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. మొత్తం రూ.10.12 కోట్ల వ్యయంతో గురుకుల పాఠశాల భవనాలను నిర్మించారని తెలిపారు. విద్యార్థుల డార్మెటరీ, పాఠశాల భవనాలతో పాటు వంట గది, డైనింగ్ హాలు, స్టాఫ్ క్వార్టర్లు, ప్రిన్సిపాల్ క్వార్టర్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ హయాంలో గురుకుల పాఠశాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా ఏళ్ల తరబడి పనులు ముందుకు సాగలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

అమరవీరుల వారోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: పీడిత ప్రజల విముక్తి కోసం, వారి హక్కుల రక్షణ కోసం ఎందరో పోరాడి అమరులయ్యారని, వారి ఆశయ సాధనకు నేటి యువత ప్రజా పోరాటాల్లో భాగస్వాములు కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మంచిలి రాజు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.